

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రచారం నిర్వహిస్తున్న జూడియో సంస్థ ఉద్యోగులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెరగాలి

బంజారాహిల్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై వాహన చోదకుల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ అన్నారు. డ్రంకెన్ డ్రైవ్ చేయొద్దు.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం డ్రైవింగ్ చేయొద్దు అనే నినాదాలతో జూడియో సంస్థ ఉద్యోగులు గురువారం పంజాగుట్ట చౌరస్తాలో వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వాహన చోదకులకు అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న దాతలు రాజనర్సు, జి. స్వప్న తదితరులు

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

ఎర్రగడ్డ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించే తండ్రి క్యాన్సర్ బారిన పడటంతో ఆర్థిక స్తోమత లేక చదువు మానేయాలనుకుంటున్న ఇంజనీరింగ్ విద్యార్థినికి విద్యుత్ శాఖ అధికారులు ఆర్థిక సహాయం అందజేశారు. ఎర్రగడ్డ జీటీఎస్ విద్యుత్ కార్యాలయంలో హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినికి దాతలు, విద్యుత్ శాఖ అధికారులు డీఈ రాజనర్సు, ఏఈ జి. స్వప్న రూ. 25 వేలు అందజేశారు. హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవి నాయక్ మాట్లాడుతూ సాయిబాబానగర్‌కు రమేష్ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. దాంతో బీటెక్ చదువు మానేయాలనుకుంటున్నానని అతడి కుమార్తె విషయం తమకు తెలపడంతో దాతల సహాయంతో ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఆపన్నులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ సంస్కర్త కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

2న బీసీల చలో ఢిల్లీ

పంజాగుట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏప్రిల్ 2న చలో ఢిల్లీ, జంతర్ మంతర్ వద్ద రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో జరగనున్న బీసీల మహాధర్నా పోస్టర్‌ను ఓబీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశంగౌడ్, బీసీ ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డి. సాంబశివ గౌడ్, ఎంబీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెక్కం వెంకట్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.రామకృష్ణంరాజు, వివిధ సంఘాల నాయకులు ఏ. రామకోటి ముదిరాజ్, శివకుమార్, బి.సౌజన్య, ఏ.రామ్మూర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సారిపల్లి కొండలరావుకు అక్కినేని జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

నాటకాలను ఆదరించాలి : ఎమ్మెల్యే గాంధీ

అమీర్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర నాటక కళాపరిషత్ 96వ వార్షిక జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా అమీర్‌పేటలోని కమ్మసంఘం హాల్‌లో గురువారం పద్మ విభూషణ్ అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. పట్టణాల్లో నాటకాలు చూసేవారు కనిపించడం లేదన్నారు. నగరాల్లో నాటకాలను ఆదరించాలని, అందుకు తమ ప్రోత్సాహం, సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావుకు అక్కినేని జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ఇంద్రప్రస్థ నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద్‌రావు, అమీర్‌పేట కమ్మసంఘం అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్ సంగీతాయాదవ్ తదితరులు

ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక

బంజారాహిల్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లోని లేక్ వ్యూ బంజారాలో గురువారం ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ మాసంలో నగరానికి ప్రత్యేక శోభ సంతరించుకుంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు వనం సంగీతాయాదవ్, మహాలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

పాత స్నేహితులను కలిపిన ఇఫ్తార్

బోరబండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల క్రితం పాఠశాలలో కలిసి చదువుకున్న పాతదోస్తులను ఇఫ్తార్ విందు కలిపింది. డాన్‌బాస్కో హైస్కూల్‌లో 1981-86 వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు దేశవిదేశాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తున్నారు. పాఠశాల విద్య పూర్తయి 40 ఏళ్లు గడచిన సందర్భంగా స్నేహితులను ఒకచోట చేర్చాలని వాడ్రేవు సతీష్‌కు ఆలోచన వచ్చింది. దీంతో నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న దోస్తులకు చరవాణి ద్వారా సమాచారం ఇచ్చి ఇఫ్తార్ విందును స్పాన్సర్ చేశాడు. చీరాలలో ఉంటున్న సతీష్ చొరవతో అందరూ గురువారం ఒకచోట కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుకున్నారు. పూర్వ విద్యార్థులు ఎం.డి.కరీముల్లా, ఎం.డి.ఖాజా మొయినుద్దీన్, ఎం.డి.షఫివుల్లా ఖాన్, శ్రీరంగ శ్రీనివాస్, జగన్, వేణుగోపాల్, మురళి, నర్సింగ్, ప్రతాప్ రెడ్డి తదితరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

సైకిల్ సవారీ

- ఐటీ సంస్థలు.. యువత ఆసక్తి
- హిల్స్‌లో నయా సంస్కృతి



సైకిల్ పోటీల్లో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు (ఫైల్)

బంజారాహిల్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సైకిలే కదా అని చులకనగా చూడకండి.. తొక్కేకొద్దీ శరీరంలోని కొవ్వును కరిగిస్తుంది. చెమటలు పట్టించి మనలోని సత్తువను నిద్ర లేపుతుంది. కొత్త ఉత్తేజాన్ని నింపుతుంది. అందుకే అది మనకు ఆరోగ్యమిత్ర. ఇంతటి ప్రయోజనం గల సైకిల్‌పై బంజారాహిల్స్ జూబ్లీహిల్స్, మాదాపూర్ వాసులు దృష్టి సారిస్తున్నారు. సైక్లింగ్‌ను ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నారు. సైకిలింగ్ చేయాలని నగర వాసులను మెట్రో కూడా ప్రోత్సహిస్తుంది. ఈ నేపథ్యంలో సైక్లింగ్ నగరంలో నయా ట్రెండ్‌గా మారింది

ఆరోగ్యం.. పర్యావరణం..

ఓ పక్క ఆరోగ్య పరిరక్షణ, మరో పక్క పర్యావరణ ప్రయోజనకారి సైకిల్. నగరంలోని కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు దీని ఆవశ్యకతను గుర్తించాయి. తమ సంస్థల్లో పనిచేసే సిబ్బంది వాహనాలను కార్యాలయ ఆవరణ బయటే పార్కు చేసి లోపలికి ప్రత్యేకంగా సమకూర్చిన సైకిళ్లపై మాత్రమే అనుమతిస్తున్నాయి. ఇన్ఫోసిస్ లాంటి సంస్థలు ఇందుకు ఉదాహరణ. కాలుష్య ప్రభావం తమ సిబ్బందిపై పడకుండా ఉండేందుకు ఇలా చేస్తున్నట్టు వారు చెబుతున్నారు. దీనివల్ల ఉద్యోగులకు కొద్దిపాటి శారీరక శ్రమ కూడా ఉంటుందనేది వీరి ఉద్దేశం. ఇప్పుడు ఈ బాటలో చాలా సాఫ్ట్‌వేర్ సంస్థలు పయనిస్తున్నాయి.

వారాంతంలో పోటీలు

కుర్రకారులో సరికొత్త ఉత్సాహాన్ని నింపేందుకు నగరంలోని కొన్ని సంస్థలు సైతం ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగానే హైదరాబాద్ బైస్కిల్ క్లబ్‌లో దాదాపు 200 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా వివిధ సందర్భాల్లో సైకిల్‌నే వాడతారు. ఎకో ఫ్రెండ్లీగా ఉండాలంటూ ప్రచారంతోపాటు వారాంతాల్లో సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. తద్వారా దీని ప్రయోజనాన్ని వివరిస్తున్నారు. ఓ సంస్థ వారాంతంలో బంజారాహిల్స్‌లోని తమ కార్యాలయం నుంచి గోపన్‌పల్లి వరకు సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తోంది. గతంలో ఓ పోలీసు అధికారి కిందిస్థాయి సిబ్బందికి వారంలో ఒకరోజు సైకిల్‌పై రావాలని సూచించిన విషయం తెలిసిందే.

వ్యాయామానికి..

ఇప్పుడు ఇంట్లో వ్యాయామం చేసుకునేందుకు సైతం స్టాండింగ్ సైకిళ్లు ఎన్నో ఆధునిక హంగులతో మార్కెట్లో లభిస్తున్నాయి. ఫిట్‌నెస్ కోసం వేల రూపాయల నుంచి లక్షల రూపాయలు ఖర్చు చేసి వీటిని ఇంట్లో ఏర్పాటు చేసుకుంటున్నారు. స్పీడుకు తగ్గట్టుగా వీటిని మార్చుకుంటున్నారు. తొక్కేటప్పుడు ఎంత సమయం పడుతుంది.. ఎన్నిసార్లు తొక్కుతున్నాం.. శరీరంలో ఎంత కొవ్వు శాతం కరుగుతుంది అనే అంశాలను తెలుసుకునేలా వీటిని రూపొందించారు. స్టాండింగ్ సైకిల్ శరీరాన్ని ఉత్తేజ పర్చడమే కాకుండా కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. ప్రతీరోజు ఉదయం గంట పాటు సైక్లింగ్ చేయడం వల్ల తాను రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతున్నానని బంజారాహిల్స్‌కు చెందిన రతన్ అంటున్నారు. గతంలో జిమ్‌లోకి వెళ్లి సైక్లింగ్ చేసేవాడినని, ఆ తరువాత స్టాండింగ్ సైకిల్‌ను కొనుగోలు చేసి ఇంట్లో పెట్టినట్టు చెప్పారు. ప్రతీ రోజు కుటుంబ సభ్యులంతా అరగంట పాటు స్టాండింగ్ సైక్లింగ్ చేస్తున్నారన్నారు.

- నగరంలోని ఇన్ఫోసిస్ తదితర సాఫ్ట్‌వేర్ సంస్థలు తమ కార్యాలయ పరిసరాల్లో సైకిల్‌ను మాత్రమే వినియోగించాలంటూ సిబ్బందికి సూచిస్తున్నాయి. ఇదే బాటలో మరికొన్ని సంస్థలు నడుస్తున్నాయి.
- కొన్ని కళాశాలలు సైతం క్యాంపస్‌లో ఇలాంటి పద్ధతినే అవలంబిస్తున్నాయి. ప్రాంగణలో సైకిల్ మాత్రమే వినియోగించాలని నిబంధనలను విధిస్తున్నాయి.
- హైదరాబాద్ బైస్కిల్ క్లబ్‌కు చెందిన దాదాపు 200 మంది సభ్యులు సైకిల్ ప్రాచుర్యాన్ని పెంచేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు.
- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ ఫిజికల్ ఫిట్‌నెస్ స్పోర్ట్స్ అండ్ సైన్సెస్ సంస్థ సైతం వారాంతాల్లో శరీర దారుఢ్యానికి సైక్లింగ్ పోటీసులను నిర్వహిస్తోంది.
- నగరంలోని కొన్ని పోలీస్ స్టేషన్‌లలో సైతం వారంలో ఒకరోజు సైకిల్ పై విధులకు రావాలంటూ ప్రతిపాదన ఉంది. కానీ ఇది ఇంకా అమలుకు నోచుకోలేదు.

ఫిట్‌నెస్ కోసం..

ఫిట్‌నెస్ పై అవగాహన పెంచడంతోపాటు సైక్లింగ్ పై మక్కువ పెరిగేలా ఫిట్‌నెస్ సెంటర్‌లు తమ కార్యకలాపాలకు రూపకల్పన చేసుకుంటున్నాయి. స్టాండింగ్ సైకిల్‌ను తొక్కిస్తూ పోటీలు నిర్వహిస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా ఇతర నగరాలకు కనెక్ట్ అవుతూ నగర యువత పోటీ పడుతున్నారు. ఈ వేగం వల్ల శరీరంలో వ్యర్థ పదార్థాలు కరిగిపోవడంతో పాటు శరీరాకృతిని బాగు చేస్తుందని ఫిట్‌నెస్ ట్రైనర్ అమర్ రుపాన్ అంటున్నారు. వీకెండ్‌లో తన ఫిట్‌నెస్ సెంటర్‌లో ఇలాంటి పోటీలు పదుల సంఖ్యలో జరుగుతున్నాయన్నారన్నారు.

మెట్రోతో..

నగర వాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సైక్లింగ్ వైపు దృష్టి మళ్లేలా మెట్రో చేస్తుంది. మెట్రో రైలు దిగగానే స్టేషన్‌లలో సైకిల్ బైక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్టేషన్ సమీప ప్రాంతాలకు వెళ్లే వారు వీటిని ఉపయోగించేలా ఏర్పాట్లు చేసింది. ఈ ప్రయత్నం వల్ల నగర వాసులకు సైకిల్ తొక్కడం ఓ అలవాటుగా మార్చడంతో మెట్రో కీలకంగా మారబోతుందనడంతో అతిశయోక్తి లేదు.



డంపింగ్ యార్డు ఇన్‌చార్జి వేధింపులు

- కాపాడాలంటూ స్వచ్ఛ ఆటో కార్మికుల డిమాండ్



జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎదుట ధర్నా చేస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికులు

బోరబండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు పక్కన ఉన్న జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఇన్‌చార్జి వేధింపుల నుంచి కాపాడాలని స్వచ్ఛ ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ధర్మచక్రం జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం డంపింగ్ యార్డు ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు రంగన్న మాట్లాడుతూ.. రాంకీ సంస్థ తరఫున డంపింగ్ యార్డు ఇన్‌చార్జిగా వచ్చిన లక్ష్మి వేధింపులు, దౌర్జన్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆరోపించారు. డంపింగ్ యార్డు ప్రాంగణంలో తమ వాహనాలను పార్కు చేయనీయడం లేదని, ఎవరైనా పార్కు చేస్తే వాహనం చక్రాలలో గాలి తీసివేస్తున్నారని తెలిపాడు. ప్రశిస్తే సెక్యూరిటీ సిబ్బందితో దాడి చేయించడమే కాకుండా తమపై కేసులు పెడుతున్నారని వాపోయాడు. మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ఆమెను బదిలీ చేయాలని డిమాండ్ చేశాడు. స్వచ్ఛ ఆటోలు, చెత్త తరలింపు వాహనాలను కృష్ణకాంత్ పార్కు మార్గంలో నిలిపివేసి ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధర్నా చేస్తున్న కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అధికారుల ఆదేశాలు అమలు చేస్తున్నా..

అధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నాని డంపింగ్ యార్డు ఇన్‌చార్జి లక్ష్మి తెలిపారు.

తెలుగు భాష ఔన్నత్యానికి 'రంజని' కృషి అభినందనీయం



రంజని జీవన సాఫల్య పురస్కారాన్ని పరుచూరి వెంకటేశ్వరరావుకు అందజేస్తున్న సుధీర్‌కుమార్

ఖైరతాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యం కోసం 60 సంవత్సరాలుగా రంజని చేస్తున్న కృషిని సినీ మాటల రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వరావు అభినందించారు. గురువారం రంజని తెలుగు సాహితీ సమితి, ఏజీ ఆఫీసు వారి శ్రీ విశ్వావసు నామ ఉగాది సంచిక ఆవిష్కరణ కార్యక్రమం ఏజీ ఆఫీసులో రంగస్థల వేదిక వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా రంజని జీవన సాఫల్య పురస్కారాన్ని పరుచూరి వెంకటేశ్వరరావుకు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏజీ ఆఫీసు పూర్వ పీఏజీ, ఐఏ అండ్ ఏఎస్ డాక్టర్ ఎల్‌వీ సుధీర్‌కుమార్ ఉగాది సంచికను ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు తాను ఏజీ ఆఫీసు ఉద్యోగిగా, రంజని సంస్థలో, తెలుగు నాటక సమితిలో చురుకైన పాత్ర పోషించినట్లు గుర్తుచేశారు. ప్రముఖ జ్యోతిష పండితుడు బ్రహ్మశ్రీ ఆదిరాజు శ్రీనివాస ఫణీంద్ర ఉగాది ప్రవచనం చేశారు. ఏజీ ఆఫీసు ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ నావల్‌కిషోర్, రంజని అధ్యక్షురాలు నందిరాజు పద్మలతా జయరాం, ఉపాధ్యక్షుడు అద్దేపల్లి రాధాకృష్ణ, ప్రతినిధులు మట్టిగుంట వెంకటరమణ, కృష్ణంరాజు, పార్వతి, వి. నాగరాజు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయం
హుండీల ఆదాయం రూ. 49,20,926

అమీర్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను గురువారం లెక్కించారు. 46 రోజులకు 18 హుండీల ద్వారా రూ. 49,20,926 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బి. కృష్ణ తెలిపారు. జనరల్ హుండీల ద్వారా రూ. 47,03,581, అన్నదానం హుండీలో రూ. 2,17,345 వచ్చింది. 34 యూఎస్ డాలర్లు, 5 కెనడా డాలర్లు, 5 యూరోస్, 10 దిరహమ్స్ వచ్చాయి.

కనకదుర్గా టెంపుల్ ఈవో అంబుజా పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో ఆలయం ఈవో కృష్ణ ట్రస్టీ చైర్మన్ సాయిబాబా గౌడ్, సూపరింటెండెంట్ హైమావతి పాల్గొన్నారు.

ఏఈఈలకు పదోన్నతులు ఇవ్వాలి

పంజాగుట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్(ఏఈఈ)కు పదోన్నతులు ఇవ్వాలని అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగిక్యూటివ్ ఇంజనీర్స్(ఏటీఏఈఈ)అధ్యక్షుడు బండి శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖలో ఖాళీలు ఉన్నా 17 సంవత్సరాలుగా పని చేస్తున్న ఒక్క ఏఈఈకి కూడా పదోన్నతి ఇవ్వలేదన్నారు. ఒక్క ప్రమోషన్ కూడా తీసుకోకుండా చాలామంది రిటైర్ అవుతున్నారని, అనారోగ్యంతో మృతి చెందుతున్నారన్నారు. రంజాన్ పండగ లోపు పదోన్నతి ఇవ్వకపోతే ఏప్రిల్ 3 నుంచి జలసౌధలో నిరాహారదీక్షలు చేస్తామని ప్రకటించారు.

తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ అసోసియేషన్, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ తమకు మద్దతు తెలిపాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆధార్ కేంద్రం

ఖైరతాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. విద్యార్థులతోపాటు స్థానికుల ఆధార్ అప్‌డేట్ చేయడంతోపాటు కొత్తకార్డుల కోసం వివరాలను నమోదు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. చిరునామా మార్పిడి కోసం గ్యాస్, విద్యుత్ బిల్లు, ఓటర్ ఐడీలు తీసుకురావాలని, పేరులో తప్పుల సవరణకు పాన్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, డ్రైవింగ్ లైసెన్సుల్లో ఏదో ఒకటి తీసుకురావాలని, పుట్టిన తేదీలో మార్పుల కోసం ఎస్ఎస్‌సి మెమో, పాస్‌పోర్టు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌లో ఏదో ఒకటి తీసుకురావాలని సెంటర్ నిర్వాహకులు సంజయ్ వర్మ, రమేష్ తెలిపారు.

మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలి

పంజాగుట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ సభ్యుడు పవన్ ఖేరాకు వినతిపత్రం ఇచ్చామని గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఐఐఎంసీ మేనేజ్‌మెంట్ టాలెంట్ టెస్ట్‌కు
500 మందికి పైగా విద్యార్థులు

ఖైరతాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఐఐఎంసీ కళాశాల నిర్వహించిన మేనేజ్‌మెంట్ టాలెంట్ పరీక్షకు మంచి స్పందన లభించింది. అంతర్జాలం మాధ్యమంగా జరిగిన ఈ పరీక్షలో 13 రాష్ట్రాల్లో 80 పట్టణాల నుంచి వివిధ కళాశాలలకు చెందిన డిగ్రీ, పీజీ చదువుతున్న సుమారు ఐదువందల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందజేశామని ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.

మలబార్ జువెలరీ షో రూంలో చోరీ

- బంగారు గాజు స్థానంలో నకిలీది పెట్టిన మహిళలు
- ఆలస్యంగా ఘటన వెలుగులోకి

పంజాగుట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బంగారం ఆభరణాలు కొనుగోలు చేయడానికి వచ్చిన మహిళలు సిబ్బంది కళ్లు కప్పి 54.89 గ్రాముల బంగారు గాజును దొంగలించారు. దాని స్థానంలో బంగారు పూత పూసిన నకిలీ గాజును పెట్టి జారుకున్నారు. సోమాజిగూడలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ జువెలరీ షోరూంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీ రాత్రి నలుగురు మహిళలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడానికి జువెలరీ షోరూంకు వెళ్లారు. బంగారు గాజులు కావాలని సేల్స్ సిబ్బందిని అడిగారు. వారు పలు డిజైన్ల గాజులను చూపించారు. కొత్తడిజైన్లు చూపించమని అడిగారు. సేల్స్‌మన్ టక్కిల్లే దత్తాత్రి వేరే డిజైన్లు చూపించడానికి గాజుల కోసం వెతుకుతుండగా ఇద్దరు మహిళలు అతడి దృష్టి మళ్లించి డిస్‌ప్లే ట్రేలో నుంచి బంగారు గాజు తీసుకొని, దానిని స్థానంలో నకిలీ గాజు పెట్టారు. డిజైన్లు నచ్చలేదని మహిళలు వెళ్లిపోయారు. 21వ తేదీన సిబ్బంది స్టాక్‌ను తనిఖీ చేస్తుండగా ఓ కౌంటర్ డిస్‌ప్లేలో ట్యాగ్ చేయని గాజును గమనించారు. అనుమానం వచ్చి తనిఖీ చేయగా అది నకిలీ గాజు అని తేలింది. సిబ్బంది సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించగా 20వ తేదీన వచ్చిన మహిళలు 54.89 గ్రాముల బంగారు గాజు కాజేసి దాని స్థానంలో నకిలీ గాజు పెట్టినట్లు గుర్తించారు. షోరూం డిప్యూటీ హెడ్ కె.ఎం జీజీష్ బుధవారం రాత్రి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ టాప్ జీప్‌లో ఆయుధాన్ని ప్రదర్శిస్తూ ప్రయాణం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్.. కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ టాప్ జీప్‌లో ప్రయాణం చేస్తూ ఆయుధాన్ని ప్రదర్శిస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1 సర్వి హోటల్ వద్ద నంబర్ ప్లేట్ లేని ఓపెన్ టాప్ జీప్‌లో వెళ్తూ ఓ యువకుడు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించడమే కాకుండా ఆయుధాన్ని ప్రదర్శిస్తున్నట్లు వీడియోలో ఉంది. ఇన్‌స్టాగ్రాంలో ఈ వీడియో చూసిన కానిస్టేబుల్ శ్రీకాంత్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంస్థ డబ్బులు సొంత ఖాతాలోకి

బంజారాహిల్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పనిచేస్తున్నట్టు నటించారు.. అవకాశం దొరికినప్పుడల్లా కంపెనీకి చెందిన డబ్బును సొంత ఖాతాలోకి మళ్లించుకుంటున్న ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ గాయత్రిహిల్స్‌లో నివసిస్తున్న టి. అంజయ్య పారిజాత హోమ్స్, డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్. ఆయన వద్ద గోవర్ధన్‌రెడ్డి అకౌంటెంట్‌గా, గడ్డం చంద్రకాంత్ జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. బ్యాంకు లావాదేవీలు, ఇతర చెల్లింపుల నిమిత్తం తరచూ ఇద్దరూ అంజయ్య సెల్‌ఫోన్ తీసుకొని ఓటీపీలను పరిశీలిస్తుంటారు. చెక్కులపై సంతకాలు తీసుకుంటుంటారు. పదిరోజుల క్రితం తన ఖాతాలోకి రూ. 50 వేలు జమ అవ్వాల్సి ఉండగా రూ. 40 వేలు అయ్యాయి. వాకబు చేయగా చంద్రకాంత్ ఖాతాలోకి పది వేల రూపాయలు జమ అయినట్టు తేలింది. అంజయ్య బ్యాంకు వెళ్లి పరిశీలించగా రూ. 17,64,620 గోవర్ధన్‌రెడ్డి, చంద్రకాంత్ ఖాతాలోకి వెళ్లినట్టు తేలింది. సంస్థ యజమాని ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ స్థలంలోని ద్విచక్రవాహనం మాయం

బంజారాహిల్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ స్థలంలోని ద్విచక్ర వాహనం మాయమైంది. షేక్‌పేటకు చెందిన మహ్మద్ జహూర్ ఈవెంట్ మేనేజర్. ఈనెల 26న ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి వాహనాన్ని పార్కింగ్‌లో పెట్టాడు. హడావిడిలో వాహనంలో పెట్టిన రూ. 50 వేలు తీసుకోకుండా వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య



శశికళ (ఫైల్)

అమీర్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లా, అయ్యలూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల శశికళ(24) రెండేళ్ల క్రితం నగరానికి వచ్చింది. కూకట్‌పల్లిలోని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో అసిస్టెంట్ అక్విజేషన్ మేనేజర్‌గా పనిచేస్తోంది. మూడు నెలల నుంచి ఎస్ఆర్‌నగర్‌లో అద్దె గదిలో మధురానగర్‌లోని మరో స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేసే రమాదేవి అనే మిత్రురాలితో కలిసి ఉంటోంది. గురువారం ఉదయం తాను పనిచేస్తున్న బ్యాంకుకు వెళ్లగా శశికళ గదిలోనే ఉంది. శశికళకు మిత్రుడైన ఓ యువకుడు రమాదేవికి ఫోన్ చేసి శశికళ బాధపడుతూ తనకు ఫోన్ చేసిందని, గదికి వెళ్లి చూడమని చెప్పాడు. రమాదేవి వెంటనే గదికి వెళ్లగా శశికళ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కపిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

మహిళ అనుమానాస్పద మృతి

బేగంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 సంవత్సరాల వయస్సుగల ఓ మహిళ కొన్ని రోజుల నుంచి ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ వద్ద తిరుగుతోంది. ఈనెల 26వ తేదీ సాయంత్రం ఓ వ్యక్తితో కలిసి చాలాసేపు ఉంది. ఇద్దరి మధ్య వివాదం జరగడంతో అతడు ఆమెను కొట్టడంతో చనిపోయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వివరాలు తెలియరాలేదు.

వేర్వేరు ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ, ధూల్‌పేట్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.78 గ్రాముల ఎండీఎంఏ, 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ బృందం నిఘా పెట్టింది. ఎండీఎంఏ విక్రయించేందుకు వచ్చిన ఎస్‌కే మహ్మద్ రహీం, మహ్మద్ ఫక్రుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు మొబైల్ ఫోన్లు, 2.73 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. వీరికి ఎండీఎంఏ సరఫరా చేస్తున్న బెంగళూరుకు చెందిన ఇబ్రహీం జహీర్, సౌదీకి చెందిన సఫాన్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

మరో కేసులో లోయర్ ధూల్‌పేట్ ఝుంగూర్ బస్తీలో గంజాయి విక్రయిస్తున్న కునాల్ సింగ్, వినోద్ సింగ్, హేమబాయిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1.30 కిలోల గంజాయి, 4 మొబైల్ ఫోన్లు, యాక్టివా వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి దందాలో సహకరిస్తున్న అనికేష్ సింగ్, ఆర్తి బాయి, నరేష్, గణేష్ పరారీలో ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

ఆపదొస్తే 139కు ఫోన్ చేయండి

- అప్రమత్తమైన దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ పోలీసులు
- భద్రతపై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలులో నాలుగు రోజుల క్రితం ఓ యువతిపై అత్యాచార ప్రయత్నం ఘటన విషయం తెలిసిందే. దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇదే విషయంపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఆర్పీఎఫ్ పోలీస్ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సురక్షిత ప్రయాణం సబర్బన్ విభాగాలతో ప్రయాణించే ప్రయాణికులకు భద్రతను పెంచే దిశగా రైల్వే చర్యలు చేపట్టింది. రైళ్లలో ముఖ్యంగా మహిళల కంపార్ట్‌మెంట్, ఎంఎంటీఎస్ రైళ్లలో ఆర్పీఎఫ్ మహిళా పోలీసులను సిబ్బందిని మోహరించాలని రైల్వే అధికారులు ఆర్పీఎఫ్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించి ఎంఎంటీఎస్‌తో పాటు ఇతర రైళ్లలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు రైళ్లలో ఆర్పీఎఫ్ పోలీసులు డ్యూటీల్లో ఉండాలని రైల్వేజీఎం ఆదేశాలు జారీచేశారు.



బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో 139పై అవగాహన కల్పిస్తున్న నసీమా

139 నెంబరుపై ప్రయాణికులకు అవగాహన

సికింద్రాబాద్ డివిజన్‌లోని అన్ని రైల్వే స్టేషన్‌ల నుంచి రైళ్లలో వెళ్లే ప్రయాణికులకు ఆపద వస్తే 139 నెంబరుకు కాల్ చేయాలని, బేగంపేట్ ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నసీమాతో పాటు ఇతర మహిళా కానిస్టేబుళ్ల 139 ప్లకార్డులను చూపిస్తూ ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి సమయంలో ముఖ్యమైన రైల్వే స్టేషన్‌లో లైటింగ్, సీసీ కెమెరాలు, మహిళలు ఉండే కోచ్‌లో ఆర్పీఎఫ్ మహిళా పోలీస్ అధికారులు గస్తీ తిరగాల్సిన అవసరం ఉంది.

త్వరలో భవిష్యత్తు ప్రణాళికలు

- ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది నిజ సమయ పర్యవేక్షణలో అన్ని కంపార్ట్‌మెంట్లలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు
- ప్రయాణికులకు భద్రతా సందేశాలు, ముఖ్యమైన భద్రతా సమాచారాన్ని తెలియజేడానికి రైళ్ల లోపల కంట్రోల్ రూం రైలు గార్డుకు అనుసంధానం చేసి యాక్సిస్ చేయగల పానిక్ బటన్‌లు అమర్చాలి.
- ప్రస్తుతం ఉన్న 139 నెంబరు గాకుండా ప్రయాణికులకు కూర్చున్నచోటే ఫిర్యాదులు చేయడానికి ఎస్‌ఓఎస్ ఎంపికను మొబైల్ యాప్‌తో అనుసందానానికి శ్రీకారం చుడుతున్నారు.
- రైళ్లలో మద్యం తాగి ప్రయాణం చేస్తున్న వారికి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఆర్పీఎఫ్ సిబ్బందికి బ్రీత్ అనలైజర్లను అందజేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి



అడ్డగుట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి బారీ మెజార్టీతో గెలుపొందారు. గురువారం సికింద్రాబాద్ కోర్టు ఆవరణలో జరిగిన న్యాయవాదులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రాత్రి ఫలితాలు వెలువడ్డాయి. అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్, స్పోర్ట్స్ కార్యదర్శి మురళీధర్ యాదవ్, మహిళా రెప్రజెంటివ్ మహేశ్వరి, లైబ్రరీ కార్యదర్శిగా స్వామి, సంయుక్త కార్యదర్శిగా వినోద్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా సమత, పావని, సంతోష్ నియమితులయ్యారు. అనంతరం రాత్రి కోర్టు ఆవరణలో ఎన్నకల ఫలితాలు వెలువడడంతో పండుగ సంబరాలు జరుపుకొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే అన్ని రంగాల్లో ప్రగతి



షేక్ రవూఫ్ దంపతులని సత్కరిస్తున్న మర్రి రాఘవయ్య తదితరులు

చిలకలగూడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల చేరవేత, సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే ప్రగతి పథంలో పయనిస్తోందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వేమెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పేర్కొన్నారు. సికింద్రాబాద్ బోయిగూడ రైల్‌కళారంగ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో రాఘవయ్య ప్రసంగిస్తూ.. కార్మికులు, ఉద్యోగుల క్రమ శిక్షణతో విధులు నిర్వహించడంవల్ల అన్ని రంగాల్లో ప్రగతి సాధించి భారతీయ రైల్వేలో అగ్ర స్థానంలో నిలిచి అవార్డులు కైవసం చేసుకుంటోందన్నారు. శుక్రవారం పదవీ విరమణ చేయనున్న సీనియర్ సెక్షన్ ఆఫీసర్, ఎంప్లాయీస్ సంఘ్ సహాయ కార్యదర్శి షేక్ రవూఫ్ దంపతులను శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ కటి, హైదరాబాద్ డివిజనల్ మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, ఏడీఆర్ఎం. రహమన్ ఎంప్లాయీస్ సంఘ్ సహాయ కార్యదర్శి భరణీ భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి



బాణుక నర్మదకు వినతి పత్రం సమర్పిస్తున్న సభ్యులు

సికింద్రాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మదను పికెట్ గార్డెన్ శ్రీహరి హర నామ స్మరణ సంఘం ప్రతినిధులు కలిశారు. తమ సంఘం స్థాపించి 59 ఏళ్లు అవుతోందని, తమకు ఇప్పటి వరకు సరైన స్థలం కేటాయించలేదని తెలిపారు. పికెట్ గార్డెన్‌లో పూజలు, భజనలు, గీతాపారాయణానికి స్థలం కేటాయించాలని కోరారు. సంఘానికి సంబంధించిన కుర్చీలు, టేబుళ్లకు రక్షణ లేదన్నారు. గార్డెన్‌లో షెడ్డు నిర్మాణం చేపట్టి, తమకు సహకరించాలని వారు కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అప్స సభ్యులు ఇతర మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న అరుణ గౌడ్

రాంగోపాల్‌పేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకురాలు అతెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని నల్లగుట్ట కమ్యూనిటీ హాల్‌లో అప్స ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన అరుణ గౌడ్ అప్స సభ్యులు ఇతర మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో అప్స కో ఆర్డినేటర్ బసవరాజు, ఏరియా ఆర్గనైజర్ రాజేశ్వరి, శోభ పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి



ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు

తార్నాక, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కౌలు, చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వ పథకాలను అందించి ఆర్థికంగా ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో తార్నాకలోని సెయింట్ ఆన్స్ జనరలేట్ హాల్‌లో రైతు ఆత్మహత్య బాధితులతో కలిసి సంఘీభావ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ సంస్థ సహకారంతో ఆత్మహత్యలు చేసుకున్న 20 మంది రైతు కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ. 40వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈసందర్భంగా రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర కౌలు రైతులకు ఎటువంటి గుర్తింపు లేకపోవడంవల్ల వారికి ప్రభుత్వం తరఫున ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులతో పాటు, కౌలు రైతులకు భరోసా ఇచ్చి వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ఎస్ సంస్థ సెక్రటరీ గాడి శ్రీను, ఎంవీ ఫౌండేషన్ వెంకట్ రెడ్డి, ప్రముఖ పాత్రికేయులు ఉమా సుధీర్, ఎం.జనార్దన్, అమరేందర్, సుమలత, రవి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఓ ఇంటిని సీజ్ చేస్తున్న బోర్డు అధికారులు

సికింద్రాబాద్, బోయినపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలు, నిబంధనలను ఉల్లంఘించి చేపడుతు న్న నిర్మాణాలపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కొరడా ఝుళిపిస్తోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు అక్రమ కట్టడాల, భవనాల కూల్చివేత ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా గురువారం ఇంజనీరింగ్ అధికారులు న్యూ బోయినపల్లి లక్ష్మీనగర్ బస్తీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మెట్లతో పాటు ప్రహరీలను నేలమట్టం చేశారు. అనంతరం అక్బర్ రోడ్డు, రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న రెండు నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. ఓ వ్యక్తి తన సొంత స్థలానికి ఆనుకుని ఉన్న పార్కు స్థలాన్ని సైతం కలుపుకొని భవనం నిర్మిస్తుండడంతో అధికారులు అక్కడికి చేరుకుని సీజ్ చేశారు. బోర్డు అదనపు ఇంజనీర్ సాగర్, అదనపు ప్లానర్లు దినేశ్, తరుణ్, అసిస్టెంట్ ఇంజనీర్ జిష్ణులు పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంజీవయ్య వీకర్ సెక్షన్ బస్తీవాసులు

అడ్డగుట్ట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మారేడుపల్లి సంజీవయ్యనగర్ వీకర్ సెక్షన్‌లో లో ప్రెషర్‌తో నీటి సరఫరా, శిథిలమైన సీసీ రోడ్లు, దోమల నివారణకు పిచికారీ చేయాలని, కొత్త బోర్‌వేల్ వేయాలని తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే శ్రీగణేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సంజీవయ్యనగర్ వీకర్ సెక్షన్‌లో సమస్యలు లేకుండా చూస్తామని, సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే బస్తీవాసులకు హామీ ఇచ్చారు. అందుకు బస్తీవాసులు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్ విందు



కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధావత్ ఏ ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ హాజరయ్యారు. కార్యక్రమంలో మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్, రాంగోపాల్‌పేట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ టి.నర్సింగ రావు, నార్త్ జోన్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. - రాంగోపాల్‌పేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని అవమానిస్తున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న వైశ్యా కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత

తార్నాక, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందని వైశ్యా కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. గురువారం లాలాపేట్‌లోని నఫీజ్ గార్డెన్‌లో నిర్వహించిన జై బాపు-జై సంవిధాన్ కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జై బాపు, జై సంవిధాన్ ఆశయాలకు అనుగుణంగా విధానాలను రూపొందిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని అగౌరవ పరచాలని యత్నించేవారికి జై బాపు - జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మాజీ ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ కుమార్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు బ్రహ్మాజీ, అమర్నాథ్ గౌడ్, అమీర్, అనిల్, సందీప్, గంట రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

బేగంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 సంవత్సరాల వయస్సుగల ఓ మహిళ కొన్ని రోజుల నుంచి ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ వద్ద తిరుగుతోంది. ఈనెల 26వ తేదీ సాయంత్రం ఓ వ్యక్తితో కలిసి చాలాసేపు ఉంది. ఇద్దరి మధ్య వివాదం జరగడంతో అతడు ఆమెను కొట్టడంతో చనిపోయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వివరాలు తెలియరాలేదు.

చలివేంద్రం ఏర్పాటు



తార్నాకలోని లేబర్ అడ్డాలో బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మాజీ మేయర్ బండ కార్తీకా చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కన్వీనర్ కందడి నాగేశ్వర్ రెడ్డి, తార్నాక డివిజన్ అధ్యక్షుడు ఉపేందర్ యాదవ్, వెంకటేశ్ గౌడ్, పోచయ్య యాదవ్, గణేష్ ముదిరాజ్, శారదా మల్లేష్, హరి, శారద మల్లేష్ పాల్గొన్నారు.
- తార్నాక, మార్చి 27(ఆంధ్రజ్యోతి)

నేడు ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డగుట్ట తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీహాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి నర్సింగ్‌రావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ షుగర్, గైనిక్, ఆర్థోపెడిక్, చిన్నపిల్లలు, జనరల్ ఫిజిషియన్, ఫిజియోథెరపి వంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కార్పొరేట్ వైద్యులు పాల్గొంటారన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అవసరం ఉన్నవాళ్లు వినియోగించుకోవాలని ట్రస్ట్ సూచించింది. ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ సభ్యులు అడ్డగుట్టలో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు.

30న భూలక్ష్మమ్మ దేవి బ్రహ్మోత్సవాలు

మారేడుపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విశ్వవసు నామ ఉగాది పండుగను పురస్కరించుకొని పికెట్‌లోని భూలక్ష్మమ్మ దేవి ఆలయంలో భూలక్ష్మీ సమేత మహావిష్ణు స్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 30వ తేదీ ఉదయం 10.30కు వైభవంగా నిర్వహించనున్నట్టు జెట్టి ఉమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం మహాభిషేకం, శ్రీచక్ర కుంకుమార్చన, మంగళహారతి, పంచాంగ శ్రవణం, కల్యాణ మహోత్సవం, భూదేవి కథ, భూదేవి మంత్రోపదేశం, మహా నైవేద్యం, మంత్రపుష్పం, తదుపరి ఉగాది పచ్చడి వితరణ, సామూహిక లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, కుంకుమార్చన, మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

తార్నాకలో జాబ్ మేళా

తార్నాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తార్నాకలోని ఐఎస్‌ఓ డిగ్రీ కాలేజీ ఆవరణలో గురువారం సుమార్ 15 ప్రముఖ కంపనీల ప్రతినిధుల సహకారంతో కళాశాల యాజమాన్యం జాబ్ మేళా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐఎస్‌ఓ కాలేజీ చైర్మన్ టి. వెంకటస్వామి, డైరెక్టర్ టి.వినోద వెంకటస్వామి, కళాశా ప్రిన్సిపాల్ డా. ఉమా కొంపల్లి, డీన్ ఎం.మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ రాజశ్రీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వినాయక ప్రసాద్, అనురాధ పాల్గొన్నారు.

ఆంథోనీని కలిసిన ఎమ్మెల్యే దయాకర్



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తిరుమలగిరి లాల్‌బజార్ హోలీ ఫ్యామిలీ చర్చికి చెందిన పారిస్ కౌన్సిల్ మాజీ సభ్యుడు మైఖెల్ అబ్రహాం ఆధ్వర్యంలో గురువారం కార్డినల్ బిషప్ పూల ఆంథోనీని కలిసి ఆశీస్సులు పొందారు. బిషప్‌ను కలిసిన వారిలో ఆల్ ఇండియా కాతలిక్ యూనియన్ మాజీ అధ్యక్షుడు రాయ్‌డన్ రోచ్, నగర మైనారిటీ సెల్ కన్వీనర్ రేమండ్ హార్వడ్, రెవరెండ్ ఫాదర్ అలెక్స్, నరేష్, అరుణ్, హ్యారీ పాల్గొన్నారు. - తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి)

'సైబర్ నేరం జరిగితే ఫిర్యాదు చేయండి'

హైదరాబాద్ సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించడంలో భాగంగా నగర పోలీసులు పలు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా నగర సైబర్ క్రైం పోలీసులు గురువారం సికింద్రాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్‌లో విద్యార్థులకు డిజిటల్ అరెస్ట్, మ్యూల్ ఖాతాలు, ట్రేడింగ్ మోసాలు, ఓటీపీ, హనీట్రాప్, పెట్టుబడి మోసాలు, క్రెడిట్ కార్డు వంటి సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరగాడి చేతిలో మోసపోతే వెంటనే సైబర్ క్రైం వెబ్‌సైట్‌లో గానీ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సైబర్ క్రైం సిబ్బంది వివరించారు.

రైళ్లలో చోరీలు.. నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని లింగంపల్లి రైల్వే పోలీసులు పట్టుకున్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్ తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌తో పాటు కానిస్టేబుళ్లు సాయి కుమార్, షకీల్ పాషా, శ్రీనివాస్, ఇస్మాయిల్ షరీఫ్‌లు కలిసి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలో తనిఖీలు చేయగా యాలాల మండలం వడిచెర్ల గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తిని అనుమానాస్పదస్థితిలో పట్టుకొని విచారిరంచగా, రైళ్లలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్ల బ్యాగులను చోరీ చేస్తున్నట్టు చెప్పాడు. నిందితుడి నుంచి రూ 1.75లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు బ్యాగులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అదే విధంగా ఏడాది మార్చి 21న నిజామాబాద్ జిల్లాకు చెందిన పెంటయ్య కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి నుంచి నిజామాబాద్‌కు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్4లో ప్రయాణం చేస్తుండగా నిందితుడు బ్యాగును దొంగలించారు. కడప జిల్లా రాజంపేట్‌కు చెందిన షేక్ మహ్మద్ షరీఫ్ మార్చి 21న మధ్యరాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తుండగా ఇతనీ బ్యాగు దొంగలించాడు. వెంటనే బాధితుడు లింగంపల్లి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితులు వరుస లింగంపల్లి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేసి నిందితుడిని పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మృతుల కుటుంబాలకు తలసాని పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు తాను అండగా నిలుస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేఆర్ నగర్‌కు చెందిన హర్షిత్, చాచానెహ్రూనగర్‌కు చెందిన ప్రణయ్ బుధవారం తెల్లవారుజామున సికిందరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలిసిన తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం బీజేఆర్ నగర్‌లోని హర్షిత్ నివాసానికి వెళ్లి మృత దేహం వద్ద నివాళులర్పించి, తల్లిదండ్రులు కనక మాధవ్, విజయలక్ష్మిని పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం చాచానెహ్రూనగర్‌లో ప్రణయ్ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఇద్దరూ చిన్న వయస్సువారు కావడం, ఇరు కుటుంబాలకు ఒక్కొక్కరే కుమారులు కలిగి ఉండడం, తల్లిదండ్రుల కుటుంబ సభ్యుల రోదనలతో తలసాని శ్రీనివాస్ యాదవ్ చలించిపోయారు. మృతుల కుటుంబాలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆర్థిక సహాయం అందజేశారు. చేతికి అందివచ్చిన కుమారులు మృతి చెందితే ఆ బాధ ఎవ్వరూ తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటేశన్‌రాజు, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, బలరామ్, అబ్బాస్, సాయి, రంజిత్ తలసాని వెంట ఉన్నారు.

సీఎం సహాయ నిధిని చెక్కులు అందజేత

మారేడుపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట, రాంగోపాల్ పేట డివిజన్లకు చెందిన 9 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 3.32 లక్షల విలువైన చెక్కులను గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శేషు కుమారి, అరుణ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, నాయకులు నామన సంతోష్ మణి కుమార్, అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, హరి సింగ్, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ వైపు వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ - చర్లపల్లి రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో గుర్తుతెలియని(50) వ్యక్తి సికింద్రాబాద్ వైపు వస్తున్న రేపల్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఎదురుగా వచ్చి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైలు డ్రైవర్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు ఫిర్యాదు చేయగా రైల్వే స్టేషన్ మాస్టర్ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన జీఆర్పీ పోలీసులు
- కుటుంబ సభ్యులకు అప్పగింత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు ప్రయత్నించిన మహిళను జీఆర్పీ పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్‌లో ఉంటున్న ఓ మహిళ(40) గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం 1లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు పట్టాల పైకి వెళ్లింది. గమనించిన రైల్వే పోలీసులు ఆమెను రక్షించి ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చి, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను అప్పగించారు. పోలీసుల దర్యాప్తులో ఈమేకు భర్త ఇద్దరు సంతానం. కుమార్తె మానసిక దివ్యాంగురాలు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. భర్త పనికి పోకుండా ఇంటి వద్దే ఉండడంతో తరుచుగా భార్యాభర్త గొడవ పడేవారు. ఈ కారణంగానే తాను ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నానని ఆమె రైల్వే పోలీసులకు తెలిపింది. బాధితురాలికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

ఉద్యమకారుల సంక్షేమానికి బోర్డు



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ రాంరెడ్డి

ముషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ ప్రఫుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన 200 గజాల స్థలం, పింఛన్లు, రూ.20లక్షల హెల్త్‌కార్డు, ఈఎస్ఐ సౌకర్యం, ఉచిత బస్సు ప్రయాణం హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ అధ్యక్షుడు మోహన్ బైరాగి, తెలంగాణ డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జేఏసీ కోశాధికారి చంద్రన్న, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, ఉపాధ్యక్షులు సుజాత, స్వరూపారాణి, తెలంగాణ ఉద్యమకారుల అధ్యక్షుడు వేముల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.